ఉద్యోగాలు

శ్రీ బలివాడ కాంతారావు

ఒకప్పుడు "అలాంటి ఉపకారి మరి పుట్టబోడని" అన్న పెద్దమనిషే ఇప్పుడు ప్రకాశరావును గురించి "ఆఫీసరై కూర్చున్నాక కళ్లు నెత్తిమీది కొచ్చాయని" నలుగుర్లో దూషించాడు. మొన్న తను తన మేనల్లుడి వుద్యోగంవిషయం తన ఇంటికి వెళ్తే ప్రకాశరావు వుగ్రుడై "ఇలా పెరటిత్రోవన వచ్చే బనులు అంగటిత్రోవను వీరునిలా వచ్చి వుద్యోగంలో చేరకూడదూ" అని మందలించాడట!

ప్రకాశరావు చాలా పేద కుటుంబంలో పుట్టాడు. చదువుకున్నది మెట్రిక్. చేరింది గుమస్తాగిరిలో. కానీ తన సహజమైన తెలివితేటలతోనూ, వినయ సంస్కారాలతోనూ అతి చురుకుగా పైకి లేచాడు. తను ఆఫీసరై సంవత్సరం రెండు నెలలే అయింది. ఆఫీసరుగా లేనినాడు కూడా తన దగ్గరకు ఎందరో వుద్యోగాలవిషయంలో వచ్చేవారు. ప్రాధేయపడి తమ కష్టాలను చెప్పుకునేవారు. ఆయన శాంతస్వభావం, కష్టాలను చెప్పుకునేటప్పుడు చూపే సానుభూతి, యెదుటివాళ్ళను, ఒకప్పుడు వుద్యోగాలు చూపించలేకపోయినా, సంతుష్టిపరచేది. వుద్యోగం ఇప్పించలేదని యీర్ష్య చూపించేవారు కాదు.

ఏమి చేసినా కేవలం పరోపకార దృష్టితోనే చేశాడు. తన దగ్గర బంధువులు తప్పించి ఎటువంటివారు వెళ్ళినా చేతకాదు అనకండా యేదో చూద్దాం అనేవాడు. ఆ మాట ఆయన నోటి వెంబడి వచ్చిందీ అంటే సరి ఉద్యోగం దొరికిందన్నమాటే! ఎవరైనా తప్పీ జారీ డబ్బు ఇస్తే పుచ్చుకోడని యేమైనా పళ్ళూ కాయలూ పంపిస్తే తిరిగి పంపించేసేవాడు. ఇంట్లో తనూ, భార్య, యిద్దరు పిల్లలుకాక పెద్దతండ్రి పిల్లవాడొకడు, పేదవారైన దూరపుబంధువుల పిల్లలు యిద్దరూ చదువుకు ఉన్నారు. ఉద్యోగం పెరుగుతున్నకొద్దీ ఖర్చు ఇలాంటి విషయాల్లో పెరుగుతునే వుంది. ఎవరో యే మారుమూల నుంచో ఉత్తరాలు వ్రాస్తుంటారు—ఏదో బంధుత్వంకూడా కల్పిస్తుంటారు. అందులో చాలా పొగిడి వ్రాస్తుంటారు. ఈ రకం ఉత్తరాల్లో ఉద్యోగం లేని యువకులు, యెవరూ అక్కరచెయ్యని ముదుసలులు కూడా ఉంటారు. తనకు తోచిన సహాయం యెవరికీ తెలియకుండా చేయటమే తన పని. తనకు ఒకటే గర్వం—ఇటువంటి విషయాల్లో అడ్డు తగలకుండా చేయూతనిచ్చే అర్ధాంగి దొరికిందని! తను డబ్బు లేక చికాకు పడే రోజులు లేకపోలేదు — ఉద్యోగం పెద్దదికదా ఆ మాత్రం అడిగితే అప్పు యివ్వడా అని తెలిసినవాళ్లు వస్తే తను తెల్లమొగం వేస్తే భార్య ఇంటి ఖర్చుల్లో పొదుపు చేసింది సర్దుబాటు చేస్తోంది!

ఇలా తను బ్రతుకుతూ చుట్టూ వున్నవాళ్లుకూడా బ్రతకాలనే పట్టుదలతో తనకు తోచిన సహాయం చేసి గౌరవంగా బ్రతుకుతున్న ప్రకాశరావు యిప్పుడిలా యెందుకు మారాలి? ఇంత శాంతమూర్తి, తన ముఖం చూడగానే ఎవరికోపమైనా పటాపంచలౌతుందే అలాంటివాడు ఎవరైనా ఉద్యోగంకోసం వెళ్తే ఖస్సుమంటాడేం? తన్ను గౌరవించే పెద్దలను వెంటబెట్టుకొని వెళ్లినా చికాకుపడి లేదని సమాధానం చెప్పగల పరిస్థితి వచ్చిందేం? ఇతను గాఢంగా ప్రేమించే యిల్లాలిద్వారాకూడా చెప్పించలేక పోతున్నారు! ఇదివరకు తను ఒకరికి చెప్పి యెందరినో వుద్యోగాలలో వేయించాడు. ఇప్పుడు తను ఒకర్ని ఉద్యోగంలో వెయ్యాలంటే వెయ్యగల స్థానంలో వున్నాడు.

కొంతమంది తను డబ్బుకు ఇబ్బందిపడుతున్నట్లు తెలుసుకొని రాత్రిమీద యింటికి వెళ్తే "వెంటనే బయటికి పోతారా లేక పోలీసులను పిలిపించమంటారా?" అని జడిపించాడు.

ఆ పెద్దమనిషి కళ్ళు నెత్తిమీదికి వచ్చాయన్నాడని తెలిసింది. ఇంకా ఊర్లో యెందరో తనను దుమ్మెత్తిపోస్తున్నారని వీరు వారు చెవిలో వేస్తున్నారు. తెలుగువాడికి సింహాసనంమీద కూర్చునే అర్హత యెక్కడుంది? అదే ఇంకో తెగవాడైతేయీ సరికి ఆతెగవా రెందరినో ఉద్యోగాలలో వేయించేవాడని తన చెవుల్లో పడేటట్లు అనుకుంటున్నారు. రాను రాను యీ దూషణలు హెచ్చిపోతున్నయ్. తను ఇదివరకు ప్రజల్లో ఎంతగౌరవంగా బ్రతికి వాళ్ల గౌరవానికి పాత్రుడయ్యాడో ఇప్పుడు అంత అధ్వాన్నంగా వారిచేతనే దూషింపబడుతున్నాడు. పై అధికారులకు, తనపై పక్షపాతం, లంచాలు మొదలైన అబద్ధాల పుట్టలను సృష్టించి, ఆకాశరామన్న వుత్తరాలు వ్రాస్తున్నారు.

ప్రకాశరావు మొదట్లో కొంత బాధపడినా వెనువెంటనే గతంలోని గొప్పవాళ్ళ జీవితాలు జ్ఞప్తికి వచ్చి ధైర్యాన్నీ స్థైర్యాన్నీ చేకూర్చేవి. తనలో తనే ధర్మాధర్మ విచక్షణ చేసుకునేవాడు. ఉద్యోగాల విషయంలో తప్పించి యింకేవిషయంలోనూ తను మారలేదని ధైర్యంతో వుండేవాడు. ఎవరైనా ఉద్యోగం విషయం తప్పించి యింకే విషయంలో వచ్చినా ఇదివరకు కన్న యెక్కువగా గౌరవించి సత్కరిస్తున్నాడు.

అయితే ప్రకాశరావును యిలా మార్పించడానికి యేదైనా బలమైన సంఘటన జరిగిందా అంటే జరిగిందనే చెప్పాలి! అది తను ఆఫీసరు అయ్యాక మొదటి నెలలోనే ఐదే ఐదు ఖాళీలు ఒకే శాఖలో వచ్చాయి. 'ఎంప్లాయిమెంట్ ఏక్స్చేంజి' ద్వారాయేభైమంది యింటర్వ్యూకు వచ్చారు. తనే ఐదుగుర్నీ వాళ్ళ మార్కుల ప్రకారం యెంచుకున్నాడు. రేపు లిస్టు పంపిస్తామనగా ఆ రాత్రి ఒక ముసలాయన తన ఇంటికి వచ్చాడు. స్వగ్రామంలోవున్న ప్రకాశరావు తండ్రి దగ్గరనుంచి ఒక సిఫారసు ఉత్తరం తెచ్చాడు. అతి వినయంగా చేతులు నులుపుతూ ఆ ముసలాయన అన్నాడు. "బాబూ! ఆనాడు మీ తండ్రికి గడవని రోజుల్లో యెలా చూశానో ఆ పరమాత్ముడికెరుక! నువ్వు పాలులేక గిజగిజ గింజుకుంటుంటే ఆ రాత్రి మీద ఆవుపాలు పితికి యిచ్చేవాడిని. అంతా సరి—చితికిపోయాను. ఇంకా పెళ్ళికి ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఉన్న ఒక మొగపిల్లవాడికీ ఉద్యోగం సద్యోగంలేదు. యింకా నెలరోజుల్లో వాడి వయసు కూడా మించిపోయి యే గవర్నమెంటు నౌఖరీకి పనికిరాడు. ఈ రోజుల్లో యెంత తెలివితేటలున్నా పనికిరావు—ఎవరో చేపట్టేవాడుండాలి. నీవు ధర్మం కట్టుకోకపోతే యింక బ్రతుకుమీద ఆశ చాలించుకోవాలి..." ఈ ధోరణిలో ఏదో చూద్దాం అన్నా. ఆ చూద్దాం అన్నమాట ప్రకాశరావు నోటినెంబడి వచ్చిందంటే యేమిటో అర్థం తెలుసుకోలేని ముసలాయన చాలా రాత్రివరకూ బ్రతిమాలాడు.

మరుసటిరోజు వుదయం ముసలాయన కొడుకు పేరు చూస్తే నలభయ్యోవరుసలో వున్నాడు. ముసలాయన కష్టాలే తన మనస్సులో తిరగటంవల్ల జాలివేసి యిదివరకు మెరిట్ ప్రకారం యెంచిన ఐదుపేర్లలో చివరిపేరు తీసి యీ పేరు వేశాడు. ఈ యైదుగురూ ఉద్యోగాలలో చేరారు.

ఆ వారం రోజుల్లోనే ఆఫీసులో తన్ను చూడటానికి ఒక వ్యక్తి వచ్చాడు. రాగానే నమస్కరించాడు. మనిషి చిక్కిపోయి ఉండటంచేత వెంటనే ప్రకాశరావు జాలిగా "జబ్బుపడ్డారా?" అన్నాడు.

"లేదు బాబూ!" అంతలో ఆపగానే గ్రహించిన ప్రకాశరావు "అయ్యో! పాపం! నేను రోజూ ఆఫీసుకు వస్తుంటే ఆ త్రోవలోనేగా మీ యిల్లు మిమ్మల్ని చూస్తుంటాను—ఇంకెక్కడో చూసినట్లు కూడా..."

"ఇక్కడే......"

"అవునవును......మీరు క్రిందటి నెలలో యింటర్వ్యూకి వచ్చారుకదూ?"

"అవును బాబూ! నాకు చాలామంది చెప్పారు-నా బాధలు చూడలేక మిమ్మల్ని ఇంటర్వ్యూకి వెళ్ళక ముందు కలుసుకొని నా బాధలు చెప్పుకుంటే మీరు తప్పక కనికరిస్తారని......"

ప్రకాశరావు జాలిగా చూశాడు. ఆవ్యక్తి అతి దీనమైన స్వరంతో స్వవిషయం చెప్పుకపోతున్నాడు-

"ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసయిన వెంటనే నాకు పెళ్ళిచేశారు. పై చదువు చదువటానికి వుబలాటమే కాని డబ్బులేదు. ఎక్కడా సరియైన ఉద్యోగంలేదు. చేసినా రెండుమూడు నెలలే. అప్పుడే నాకు ఇద్దరు

పిల్లలు బాబూ! నాకు కొద్దిగా సాహిత్యంతో పరిచయ మేర్పడింది. ఈ కటిక దారిద్ర్యంతో నే కథలు వ్రాస్తున్నాను. దానివల్ల వచ్చే రాబడి శూన్యమనే చెప్పొచ్చు. దానిమీద బ్రతుకుతాననే ఆశలేదు. నేను అసలు రాయటానికే బ్రతికున్నాను! నేను బ్రతకాలంటే తిండికావాలి—దానికోసం డబ్బుండాలి—డబ్బుకోసం నేను వుద్యోగం చెయ్యాలి."

అలా చెప్తూనే ఆవేశంలో గొంతుక పట్టుకపోయింది. మళ్ళీ ప్రయత్నంమీద సవరించుకుంటూ "ఉద్యోగంకోసం అందుకే నా ప్రాకులాట. అంతా మిమ్మల్ని చూడమన్నారు—కానీ నా మనసు యీ దొంగతినానికి మనస్కరించలేదు. నా తాలూకు శక్తి సామర్థ్యాలు చూపించి అందరిలో నిల్చుంటే న్యాయాన్ని ధర్మాన్ని నిలిపే మీలాంటి అధికారుల హృదయాలు అన్యాయానికి పాల్పడవని నాకు తెలుసు. అంచేతనే నేను మిమ్మల్ని ముందుగా చూడలేదు. కాని నా దురదృష్టవశాత్తూ అయేభైమందిలో యెందరో పట్టభద్రులున్నారు—నాకంటే తెలివైనవారున్నారు. వాళ్లకు ఉద్యోగాలు దొరికాయి. లోకం యింత పచ్చగా వున్నప్పుడు పేదరికంచేత చచ్చిపోవటం అంటే బాధగా వుంటుంది. బహుశః అలా చచ్చిపోతానన్న క్షణంలో రేపిన భయమే యిలా తీసుకవచ్చింది."

ఆయాసంతో అలసిపోతున్న ఈ వ్యక్తివైపు చూశాడు. కళ్ళల్లో నీళ్లు అలముకొనివున్నాయి. ప్రకాశరావు శాంతంగా మీ పేరు అన్నాడు.

"ఎస్. సత్యనారాయణ."

"సరే! ఓక్షణం బయట ఉండండి" అని తను యింటర్వ్యూ కాగితాలు తీశాడు. సరిగ్గా తను తీసివేసిన ఐదోవ్యక్తే యితను. ఇతని పేరు తీసివేసే ముసలివాని కొడుకును వేసుకున్నాడు.

ఒక్కసారి మనస్సు చివుక్కుమన్నట్లయింది. ఈతని కష్టాలే యిదివరకు తెలిసివుంటే అంతపని చెయ్యలేక పోయేవాణ్నే అనుకున్నాడు. ఉద్యోగాలు వేసుకోవటంలో ఒకపద్ధతి అంటూ పెట్టుకున్నాక ఆ పద్ధతినే అనుసరించకుండా వ్యక్తుల కష్టాలతో ఉద్యోగాలు ముడిపెట్టటం సబబు కాదని యిదివరకు అనుకున్నా యిప్పుడు నిర్థారణకు వచ్చినట్లయింది. ఉద్యోగాలకు వచ్చిన వందలాదిలో ఎవరికష్టాలు వాళ్లకే వుంటాయి-కష్టాలనేవి హెచ్చుతగ్గులూ భరించే వ్యక్తుల బట్టే వుంటాయిగానీ కష్టాలన్నీ నిజానికి ఒకేస్థాయిలోనివే!

మళ్లీ సత్యన్నారాయణను పిలిచి "ప్రస్తుతానికి నేనేమీ చెయ్యలేను. మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుంటానని చెప్పగలను—అందాక ఒక స్నేహితుడు అవసరానికి ఆదుకున్నాడని యీ పదిరూపాయలూ తీసుకవెళ్లండి"ని యిచ్చాడు.

సత్యన్నారాయణ పుచ్చుకోలేదు.

"సంశయిస్తున్నారా! ఫరవాలేదు—ఒక మిత్రుణ్ణి కాదనగలరా!"

సత్యన్నారాయణ చేతులు వణకడంచూసి ప్రకాశరావు "పోనీ! నాదగ్గర అప్పుతీసుకువెళ్లండి. ఎప్పుడో మీకు కలిగిన్నాడు తిరిగి యిచ్చివేయండి."

అనగానే ఆ పదిరూపాయిలు మౌనంగా తీసుకొని అలానిల్చున్నాడు. ప్రకాశరావు ప్రశ్నార్థకంగా చూడగానే సత్యన్నారాయణ మెల్లగా "క్షమించండి మీకాలాన్ని చాలావరకు నాకష్టాలను చెప్పుకొని తీసుకున్నాను"

"అబ్బే!"

"ఒక్కకోరిక" అన్నాడు.

"చెప్పండి—సంశయించకండి"

"మరేమీ లేదు! అంతమంది యింటర్వ్యూకి వచ్చారుకదా పరీక్షలో వాళ్లలో నాస్థానం తెలుసుకోవచ్చా అని..."

ఓ క్షణకాలం ప్రకాశరావుముఖం యెర్రబడిపోయింది. మనస్సులో మథన ప్రారంభమైనా యీ యనయెదర తను తల యెత్తుకు నిలబడాలనే వుబలాటంతో "క్షమించండి! ఇటువంటివి అధికారీరత్యా గాని చెప్పకూడదు!" అన్నాడు.

"ఒక స్నేహితునిగా భావించి పదిరూపాయలు అప్పుకూడా యిచ్చారు. అంచేత అనధికార రీత్యా చెప్తారనే వుబలాటంకొద్దీ మిమ్మల్ని కష్టపెట్టి వుంటాను. క్షమించండి" అంటూ వెళ్లిపోయాడు.

ప్రకాశరావు ఆవేశంతా యేపనీ ముట్టుకోలేదు. ఇంటికివెళ్లినా, వాకిట వాలుకుర్చీ వేసుకొని కూలబడిపోయాడు.

ఆ వారంరోజుల్లో ఆఫీసుకువెళ్లేటప్పుడు వచ్చేటప్పుడూ ఆ యింటి వేపు చూసినా సత్యన్నారాయణ కనపడలేదు. నెలరోజులుదాటినా, రోజూ తన తలపుకు వచ్చినా సత్యనారాయణ అగపడలేదు. ఎంత తొందరగా యీయనకు ఉద్యోగం చూపిద్దామని ఆతృత పడ్డా సరియైన ఉద్యోగం ఖాళీ రాలేదు.

ఒకనాడు ఉదయం పదకొండుగంటలకు ఆఫీసులో ఉండగా బంట్రోతు ఒక కవరుతెచ్చి టేబిలు మీద యెదరగా పెట్టాడు. "పేరుచెప్పకండా దొరగారికి యిచ్చేమని చెప్పారు" అన్నాడు బంట్రోతు. ప్రకాశరావు కవరువిప్పి "ఆయనను వేగంగా పిలుచుకరా" అన్నాడు. బంట్రోతు హడావుడి వృథా అయింది. ఆ చుట్టుపట్టున సత్యనారాయణ ఎక్కడా అగుపించలేదు. ఆ వుత్తరంలో యిలావుంది:—

"మిత్రులు ప్రకాశరావుగారికి సత్యనారాయణ నమస్కరించి వ్రాయునది:—

ఆవేళ ఆఫీసులో మిమ్మల్ని కలుసుకున్న నాటి నుంచీ నామనస్సు బాధపడుతోంది. నాకు నేనే దొంగనై పోయాను. ప్రతిక్షణం నాలో యెవరో నా నీచత్వాన్ని ఎత్తిపొడుస్తూనే వున్నారు. నేను నా కథల్లోనిజాయితీ, సత్యం, ధర్మం, న్యాయం అనే వున్నత ఆదర్శాలను పాఠకులకు బోధిస్తాను. నేనుచేసే బోధనలకు నాప్రవర్తనలకు సామ్యం లేకపోతే నేను రచయితఅని అనిపించుకో అక్కర్లేదు—నిజానికి నేను కలం ముట్టుకోనక్కర్లేదు. నేను చేసినపని ప్రతిక్షణం పశ్చాత్తాపపడునట్లుచేసి సిగ్గుతో మీకు ముఖం చూపించకుండా చేసింది! జీవితం అంటే కడుపే కాదు అది నీతి నియమములకు కూడా స్థానం అని నానమ్మిక" ఇక నా కష్టాలంటారా? రచయిత కష్టపడాలి—తనకు జీవిత కాలం ఆవేదనే. ఆ ఆవేదనే లేకపోతే లోటిజీవుల ఆవేదనను గుర్తించలేడు - కష్టపడకపోతే హృదయం నుంచి చెప్పలేడు. హృదయంనుంచి చెప్పలేనివాడు నిజమైన రచయిత కానేకాడు. ఒక చక్రవర్తి హృదయాలాపమే యీ ప్రపంచంలో యిప్పటికీ సాటిలేని సుందరమైన మహల్ ని సృష్టించింది! అలాగే కలకాలం నిల్చేదైనా నా హృదయంనుంచే సృష్టింపబడాలి. అంచేత, నా కీకష్టాలే బలాన్ని చేకూరుస్తున్నాయి - ఆలోచనలు పుంఖానుపుంఖంగా వస్తున్నాయ్. నా కీప్రపంచమే పెద్దగ్రంథాలయం. ఇందులో ప్రతీవ్యక్తీ ఒకగ్రంథం. ప్రతిగ్రంథంచదివితే యెలా మనసు వికశించి క్రొత్తక్రొత్త విషయాలు తెలుస్తాయో అలానే ప్రతివ్యక్తినీ పరిశీలిస్తే నా కలాంటి వికాసం కలుగుతుంది. నాచుట్టూ వున్నవాళ్లు ఆధారంగా నవలవ్రాస్తున్నాను- అందులో మిమ్మల్ని ఒక పాత్రగా తీసుకుంటున్నందుకు మీరు అభ్యంతరం పెట్టరని నాకు తెలుసు—దీనికోసం రాత్రింపగళ్ళూ కష్టపడుతున్నాను. నా ఆరోగ్యం యేమైనాసరే—నాకుటుంబం యేమైనాసరే...నన్ను ఆవరించి నాలో యేదో దేవత్వాన్ని చొప్పించి పొంగిపొరలించే ఆనందంతో ఉత్సాహంతో నన్నీపనికి పూనించిన ఆ కవితామతల్లికి పుష్పాంజలులు ఘటించకండా యెలావుంటాను? ప్రకాశరావుగారూ! నేనేమీ వ్రాయలేదండీ! నేనెవణ్ణి వ్రాయడానికి?—ఆక్షణాల్లో ఆమే ఒక తేజస్సులావచ్చి నాలోచొచ్చి...తరవాత నేవ్రాసింది నేనే చదివి..."ఇది నేనేవ్రాశానా"అని ఆశ్చర్యం చెందుతుంటాను. లోడిమానవులు వారి కర్మని వారు అనుభవించుతుంటే వాళ్ల బాగోగులనుబట్టి వాళ్ళని గౌరవంచేసే మనం—అందులో నేనుకూడా ఒకడ్ని, మంచివాణ్ణి భూషించి చెడ్డవాణ్ణి దూషించడానికి అలవాటుపడిన కోట్లకోలది మానవుల్లో ఒకడిని—ఒక న్యాయాధిపతిలా ప్రతిపాత్రను అలా తనబాటగుండా పోనిచ్చి చివరకు ప్రతిమానవుడిలోనూ మానవత్వం వుందని యెలా నిరూపించగలను?—అది నాసృష్టి యెలా ఔతుంది? రానురాను నా నిష్కల్మషమైన మనసులో ఆమెకు నే బ్రతికినంతకాలం స్థానం యేర్పరచుకో గలిగితే అంతకంటే భాగ్యం నాకింకేం కావాలి?

నా ఆవేశంలో ఆనందంలో యింతవరకూ వ్రాసుకున్నాను. నేనువ్రాసిన ఒక కథకువచ్చినదీ పదిరూపాయల కాగితం! కృతజ్ఞతతో ఈకవరులోపెట్టి అప్పు తీర్చుకుంటున్నాను. నా ఉద్యోగం విషయం మీకు శ్రమపెట్టకూడదనే నిశ్చయమే యీవుత్తరాన్ని వ్రాయించింది. ఎప్పుడో మళ్ళీ నేను అంగటిత్రోవ రాగలిగినాడే వుద్యోగం చేస్తాను—అవసరమైతే!

భవదీయుడు

సత్యనారాయణ."

ప్రకాశరావు వుత్తరం మళ్లీ రెండుసార్లు చదివాడు. ఆనాడు మాసినబట్టలతో చింపిరిజుత్తుతో నీర

సంగాఉన్న వ్యక్తిలో యిలాంటి గుణగణాలున్నాయని పొరపాటునైనా వూహించలేదు. అతను నరకాన్ని స్వర్గంచేసుకునే వ్యక్తనితోచింది. ఆయనను తను సుఖపెట్టామన్న ఊహ తుడిచిపెట్టి ఆయన కుటుంబానికెలా సహాయంచెయ్యాలనే పట్టుదల తనలో చొచ్చుకపోయింది. అలాంటి ఖాళీయేవచ్చినప్పుడు సత్యన్నారాయణను ఆఫీసుకు తీసుకవచ్చి తనుచేసిన తప్పిదం ఒప్పుకొని మరీ ఉద్యోగం యివ్వాలని నిశ్చయించుకున్నాడు. అప్పుడు ఆ నవలలో తనపాత్రకు తను న్యాయంచేసిన వాడౌతానని అనుకున్నాడు.

రెండు నెలలు గడిచిపోయాయి. సత్యనారాయణ ఒక్కసారీ కనిపించలేదు. ప్రకాశరావుకు వాళ్ళ ఇంటికివెళ్ళి పిలవటానికి యెందుకో అనుమానం వేసింది. తనముఖం ఊరకనే ఆయనకు యెలా చూపించటమని వెళ్ళలేకయాడు.

ఒకనాటిఉదయం ఎండ తీక్షణంగా కాస్తోంది. ఆఫీసుకు ప్రకాశరావువెళ్తూ అంతదూరంనుంచే మామూలుగా సత్యనారాయణఇంటివేపు చూశాడు. అక్కడ చాలామందిజనం మూగివున్నారు. ఆజనంలో కాషాయవస్త్రాలలో నిల్చున్న ప్రేమసమాజీకులను కూడా చూచి గబగబ అక్కడకు వెళ్లాడు.

వాకిట కట్టెమీద సత్యనారాయణ! ఆకట్టెమీద యిల్లాలు యిద్దరుపిల్లలు తలకొట్టుకొని బావురుమంటున్నారు. పెద్దపిల్ల నాన్నానాన్నాఅని గోలపెట్తోంది. శాశ్వత నిద్రపోయిన ఆముఖం ఆయెండలో చిరునగవుతో మెరుస్తున్నట్లుంది! ప్రకాశరావుగుండె కంపించింది- అక్కడిమనుష్యులను తప్పించుకొని కట్టెదగ్గరకు వెళ్లాడు. చుట్టూవున్నవాళ్లాతనికేసి సగౌరవంగా చూస్తున్నారు. ఆబిడ్డలనుతీసి ఎత్తుకొని యింట్లో కూర్చోబెట్టినా గోలగా ముంగుకుపడుతూ దొర్లుతూ వస్తున్నారు. అప్పుడు ఇరుగుపొరుగు అమ్మలక్కలు సత్యనారాయణ భార్యను ప్రక్కకుతీశారు. తను ఒక ప్రక్క కాశాడు. కట్టెకదలిపోతుంటే అంతదూరం శోకంలో పరువెత్తే ఆ యిల్లాలిని ఆపలేకపోయారు.

తిరిగివచ్చాడు. ఇరుగుపొరుగు మనిషోమాట. "తిండితిప్పలువుంటేనా—ఏదోవున్ననాడు వేళకు యిన్ని మెతుకులు నమిలాడా? నీరసంగావున్నా ఆకాగితం కలంబదిలాడా? ఒంట్లో జీవంలేనిది యిలాంటిపనులుచేస్తే... రాత్రిమీద రాస్తూ రాస్తూ గుండె ఆగిపోయింది! పెళ్లాం పిల్లలు వున్నారని ఏదో వుద్యోగం సద్యోగం చేసి తరవాత అదేదో రాయ కూడదా?...సమయానికి ఆ ధర్మరాజు ఆదుకోకపోతే యిలా తల్లీ పిల్లలూ సముద్రంలో పడాలి గానీ ఇంకేం ఆదరువుఉంది"—ఈమాటలన్నీ ప్రకాశరావు విన్నాడు. సత్యనారాయణ యింటిపొరుగు వాకిట నిల్చొని ఒక వయసుమళ్ళిన వితంతువుంది. సహాయం చెయ్యడానికి ముందుకొచ్చే మనిషి. పెద్దపిల్లను బుజ్జగించి అన్నంతినేటట్లు చేశాడు. చిన్నపిల్లకు ఆవిడ చేతనే పాలు పట్టించాడు. రెండు రోజులు దగ్గర వుండమ్మా అని ఆమెచేత కొంతడబ్బు యిచ్చి యింటికి వెళ్ళాడు.

చీకటి పడ్డవరకూ దిగులుగా ఒక దగ్గర కూర్చున్నాడు. మూడుసార్లు భార్య యెందుకలా వున్నారని తర్కించితే చిరాకు పడగానే ఆమెదగ్గరకు రాలేదు. తరువాత వాకిట వాలుకుర్చీమీద కూర్చున్నాడు. ఆ రోజు చూచిన దృశ్యాలన్నీ మళ్ళీ అగుపిస్తున్నాయ్. ఆ పిల్ల, తండ్రి శవంమీద పడి "నాన్నా... నాన్నా..." అని గగ్గోలు పెడుతున్న దృశ్యం—నిజంగా తను యేడుస్తున్నాడు. ఇప్పుడూ కళ్లు చెమ్మగిలి పోయాయి. మనసు త్రిప్పాలనే ప్రయత్నంతో తల పైకెత్తాడు. చందమామ లేనిరాత్రి—ఆకాశం నక్షత్రాలతో నిండిపోయివుంది. ఓక్షణం రెక్కలు కట్టుకొని అనంత విశ్వంలోనికి ఎగిరి ఆ లోకాలన్నీ విహరించినట్లయింది. సత్యనారాయణ అగుపిస్తున్నాడు. మానవత్వం అనే త్రాసులో యింత కీర్తి ప్రతిష్టలు గడించుకున్న తనను—ఒక మారుమూల అనామధేయుడుగా చింకి గుడ్డలతో పేదరికంతో పడివుండిన సత్యనారాయణను వేస్తే ఆ మిత్రునివేపే మొగ్గు కనిపిస్తోంది! నిజంగా తను ఆయనదగ్గర నేర్చుకోవలసినదెంతైనావుందనుకున్నాడు. బహుశః తను యెలా వుండాలో నవలలో కొంతవరకైనా వ్రాసి వుంటాడు.

భార్య చాలసేపటినుంచి తన దగ్గరనే కూర్చుందని గమనించలేదు. ఆమె ప్రాధేయపూర్వకంగా "భోజనానికి రారా?" అని అడగ్గానే ఉలిక్కిపడి చూశాడు.

"భోజనమా?...వద్దు!" అన్నాడు.

"మీరు భోజనం చెయ్యలేదని పిల్లలుకూడా..."

చప్పున సత్యనారాయణకు ఆపిల్లల పరిస్థితీ యిలాగే వుంటుందేమో అని తట్టింది. లేచాడు నాలుగు మెతు

కులు నమిలి లేచిపోయాడు. అర్ధరాత్రి వరకూ ప్రయత్నించినా నిద్దర రాలేదు. భార్య కన్నీరు తెచ్చుకోవటం చూచి "ఒక నిజమైన ఉదారుడైన స్నేహితుడు పోయాడు. ఆయనకూ నాలానే పెళ్ళాం యిద్దరు పిల్లలూ వున్నారు......ఆకలితో చచ్చి పోయాడు-ఆ ఆకలి నేనే కల్పించాను—నేనే ఆయన చావుకు కారకుడయ్యాను......"

బొలబొలా కన్నీరు కారుతోంది. భార్య యెదురగా కాసింతైనా సిగ్గుపడలేదు—వెక్కి వెక్కి యేడ్చేస్తున్నాడు—ఆ యేడుపుతోనే "ఇదిగో నీ యెదట ఆయనసాక్షిగా ఒట్టు వేసుకుంటున్నాను...నాజీవితంలో మళ్లీ యిలాంటి పాపాన్ని వడిగట్టుకోను...లోకం అంతా నామీద దుమ్మెత్తి పోసినా...న్యాయం ధర్మమే నా దీక్ష—నిజాయితీ సత్యాలే నాకు రక్ష!"

అని భార్యను గట్టిగా పట్టుకొని యేడ్చాడు. ఆమె అతనిని హత్తుకుంటూ తల నిమిరింది... అలా ఆమెఒడిలో తల పెట్టుకొని వెక్కుతూ మాగన్నుగా నిద్దర పోయాడు.

తెలతెలవారింది. ఒక సారి భార్యాభర్తలిద్దరూ సత్యనారాయణయింటికి వెళ్లారు. వెళ్లే సరికే పిల్లలు యేడుస్తున్నారు—పెద్దపిల్ల ఓక్షణం తండ్రిని విడిచిపెట్టి వుండేదికాదట. నాన్న నవల రాస్తుంటే దగ్గరవుండి ఒక్కొక్క కాగితం అందుకొని దారంలో మౌనంగా గుచ్చేది. ఈ వేళా ఆనవలే పట్టుకుంది—యేడుస్తోంది! ఆపిల్లను ఎత్తుకొని ఇంటికి తీసుకవచ్చాడు. తండ్రిని మరిపించడానికి యెన్నోవిధాల భార్య ప్రయత్నాలు చేస్తుంటే ప్రకాశరావు గబగబా ఆ వ్రాసిన ఎనభై యెనిమిది పేజీలు చదివి పెద్ద నిట్టూర్పు విడిచాడు.

తను ఒక్క సత్యనారాయణకే ద్రోహం చెయ్యలేదు. లోకం అంతటికీ అపకారంచేశాడు. ఆ నవలే పూర్తయి వుంటే...ఎన్ని భాషల్లోకి తర్జుమా అయ్యేది? యెందరిపై దీని ప్రభావం పడేది?...ఇందులో ఆ ఆఫీసరు పాత్ర...గర్వంలేని మనిషి—బయటచూస్తే వినయవిధేయతలతో ఆడంబరంలేని వ్యక్తి—నలుగురు ప్రజలలో తానొకడు. కానీ ఉద్యోగరీత్యా చూస్తే అతనిది కోడిపిల్లకుండే గుండెకాయకాదు! తుఫానులో ఒంటరిగా ఓడనడిపే నావికుడు. లోకాన్ని కాల్చివేస్తున్న హాలాహలాన్ని మ్రింగే గరళకంఠుడు. చెడ్డవాణ్ణి హతమార్చే మనిషికాడు-ఆచెడ్డవాడు తనలాంటి వాడేకానీ వాడికి పుప్పిపన్ను వుంది—ఆ పన్నును వూడబెరికి మిగతా పళ్ళను రక్షించటమే తన కర్తవ్యం! వాడికి కడుపు నొప్పి-ఆ వోరిసిన పేగును కత్తిరించిబాధనయంచేసే సర్జను ఈ ఆఫీసరు! జాలి, దయ యివి బయటకు కానరావుగానీ శరీరం కోస్తే రక్తంఅంతా వాటితోనే నిండివుంటుంది! హృదయ సంస్కారంతో మెసలి సమస్యలనే పరిష్కరిస్తాడు గానీ మనుష్యుల్ని మాత్రం సమస్యలుగా చెయ్యడు. ఇలాంటి ఆఫీసరు న్యాయాన్ని ధర్మాన్ని ప్రతిష్టించేవాడిలో లోటు ఒకటి వుంటుంది. ఆ లోటేమో కలం ముందుకు సాగి వుంటే తెలిసేది.

ప్రకాశరావు అదేమిటని వూహించసాగాడు. బహుశః ఒకోసారి ఆ ఆఫీసరుకు అహంభావం ఆవరిస్తుందేమో! నిజంగా తనకు ఎంత ప్రయత్నించినా ఒకోసారి అహంభావం ఆవరించేది. నలుగురూ మెచ్చుకుంటే తనకు తానే ఆత్మస్తుతి చేసుకునేవాడు. అలా మెచ్చుకోవాలనేకదా తను నిజానికి వీళ్ళందరికీ వుపకారం చేసేవాడు! మనిషి స్వలాభాపేక్ష లేకుండా బ్రతకటం దుర్లభం—కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలే మనిషియొక్క స్వరూపం! ఇవి యెప్పుడైతే సరియైన పాళ్లలో వుండవో మనిషిఅప్పుడే పతనం జెందుతుంటాడు. వీటిలో ఏది హెచ్చయినా చిక్కే!

ప్రకాశరావు యేపనిచేసినా యీసారి ఆ ఆఫీసరుతో పోల్చుకునేవాడు. తను కనీసం ఆ పాత్ర దరిదాపులకయినా కొన్నాళ్ళకు చేరగలనా అన్న తాపత్రయంతో మెసలేవాడు. సత్యనారాయణ భార్యకు యీ వూర్లో ఆ వూర్లో కథలు పోగుచేసిన కొద్దిడబ్బును పంపిస్తున్నారు. నాలుగునెలలు దాటిపోయాయి. ఈలోగా ఆమె పెదతల్లికొడుకు వచ్చి చేరాడు. ఆమెను పిల్లలను తనకేదో వుద్యోగం దొరికితే చేరదీసి పెంచాలని తాపత్రయం.

ఒకనాటి సాయంత్రం సత్యనారాయణభార్య ప్రకాశరావుఇంటికి వచ్చింది. అసలు విషయం ఆయనభార్యతో చెప్పుకుంది. ప్రకాశరావు ఆఫీసునుంచివచ్చేక ఆమె ప్రాధేయపడుతూ అంతా చెప్పింది. భర్తను తల్చుకుని యేడ్చింది. ఆయన వుంటే...... తన కన్నీరుచూసి యెంప్లాయిమెంట్ ఆఫీసరే లిస్టులో

పేరు యిరికించాడట. ఎందుకు నే మీరు కనికరించక పోతే బ్రతుకలేమని బ్రతిమాలింది. ఆవేళ నే ఆ వచ్చిన వారిని పరీక్ష చేశారు. సత్యనారాయణకు చేసిన పాపం పరిహారంచేసుకోడానికి సరియైన అదను దొరికింది. తను ఇప్పుడు వుద్యోగాలు వెయ్యటం తన ఒక్కరిచేతు లలో పెట్టుకోలేదు. తనతో ముగ్గురు వున్న కమిటీని పెట్టాడు. దానికి తను పెద్దయినా అంతా బాహాటంగా న్యాయంగా చెయ్యాలన్న ఉబలాటం హెచ్చి పోతోంది. తను ఇదివరకు ఈమెకు సహాయం చెయ్యా లన్న పట్టుదల జ్ఞప్తికి వచ్చింది. తనలోని బాధ చాలా వరకు కప్పడిపోతోంది—తను కొంతహాయిగా బ్రతుక గలను—ఇలా ప్రకాశరావు ఆలోచించుకుని ఒక నిర్ణ యానికి వచ్చాక అన్నాడు.

"ఆయన రేపుప్రొద్దున్న పెళ్ళిచేసుకుంటే మిమ్మల్నీ మీ పిల్లలను సరిగ్గా చూస్తాడా అని."

"ఆ అనుమానం వద్దుబాబూ. పెదతల్లి కొడు కయినా మొదటినుంచీ నేనంటే స్వంత చెల్లెలికంటే అభిమానం ఎక్కువ—ఊరూర ఉద్యోగంకోసం తిరు గుతూ బాధపడుతూ వచ్చాడు. నాకింతకంటె మరే సహాయం చెయ్యమని మీ గడపకు రాను. నా పిల్లలు నేనూ బ్రతకడానికి ఇంతకంటే యింకేం సహాయం నాకు అక్కర్లేదు."

"రేపొకసారి కనుపించమ్మా" అని ఆ అబ్బాయి పేరు వ్రాసుకుని ఆమెను పంపించాడు. ఆ రాత్రంతా సరిగా నిద్దరపట్టలేదు. తను యిన్నాళ్ళకు మచ్చ మాపు కుంటున్నాననే సంతోషమే తన్నలా చేసింది—ఇది పాపపు పనికాదని పాపాన్ని తుడిచిపెట్టు కుంటున్నా నని ఈ పనితో ఆమె భర్తకు ఆత్మశాంతి కలుగజేస్తు న్నానని అనుకున్నాడు.

ఆఫీసులో అడుగు పెట్టాడు. నిన్నటి కాగితాలు ఆ మార్కులు అన్నీ సంతోషంతో తిరగవేశాడు. ఈ పేరు ఎక్కడ వుందని చూశాడు—అదిగో పదిహే నవది...తీసుకోవలసిన నలుగురుపేర్లు పైన వ్రాశారు మిగతా ఇద్దరు మెంబర్లు—వాళ్ళని సరే వెళ్ళండి అన్నాడు. ఎర్రసిరా కలం పట్టుకున్నాడు ధైర్యంగా. కాగితం మీదకు ఇంకా చేరలేదు...చెయ్యి గజగజ వణకడం ప్రారంభించింది...సరిగా ఆ నాలుగవ పేరు మీద కలం చివర ఆన్చాడు...శరీరం అంతా కంపింప సాగింది...ఎందుకో ముచ్చెమటలుపోసేస్తున్నాయ్... కళ్ళు మూతలుపడి పోతున్నాయి. ఆపేరు కొట్టివేయడ మనే పని చేసేద్దామనే కళ్ళకు ఆమె దీనాలాపం... సత్యనారాయణకు తను చేసిన ద్రోహం అంతా కూడి మనసును ఉరకలు వెయ్యిస్తున్నాయ్. కాని మనసు కంటే అతీతమైన శక్తి లోపలనుంచి వణికించివేస్తోంది. ఆ కళ్ళు మూసినా ఆ లోపలి తెరలో ఒక ఆకారం— దీనాతిదీనంగా "నాపేరు కొట్టివేస్తున్నావా? నా బాధలు నీకేం తెలుసు? బాధలు చూశా వుద్యోగాలు ఇస్తావ్? నన్నింకొక సత్యనారాయణను చేస్తున్నావా? నీలో న్యాయం ధర్మం ఇదేనా? సత్యనారాయణ నీపనికి రవ్వంతైనా సంతోషిస్తాడా? ఆవేళ రాత్రి యేడుస్తూ ఆయనసాక్షిగా చేసిన వాగ్దానాలన్నీ ఏమయ్యాయ్?" మళ్ళీ ఆ ప్రతిబింబం పకపక నవ్వుతూ హేళనచేసింది. ఈ ప్రశ్నలన్నీ బాధగా యీ జాలిగొన్న హృదయ ములో గ్రుచ్చుకొని రక్తం చిమ్మినట్లయింది. ఆ బాధ లోనే ఆగాథ జ్ఞాపకంవచ్చింది. కళ్ళు తెరచాడు— తను ఆఫీసరు! హాలాహలాన్ని నవ్వుతూ మ్రింగే గరళ కంఠుడు కావాలి!

ఆ బాధలోనే నవ్వాడు—నవ్వుతూ గుండె మీద చెయ్యి వేసుకుని రొెగరూపిరితీస్తూ గట్టిగా లోన అనుకున్నాడు "న్యాయం ధర్మమే నా దీక్ష! నిజాయితీ సత్యాలే నాకు రక్ష! ఈ అన్యాయం జరుగదు. జరగ డానికి వీల్లేదు" అని అంటూ కలం టేబిలుమీద పడేశాడు.